# <u>పత్రికా ప్రకటన</u>

తేది.16.10.2017.

## <u>విజయవాడ నగర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో-విద్యార్థులు మరియు యువత భాగస్వామ్యంతో "వనం మనం" "హరితాంధ్రప్రదేశ్"లో నూతన ప్రక్రియ</u>

### *విత్తనాల ప్యాకింగ్ ప్రక్రియను పరిశీలించిన నగర పోలీస్ కమీషనర్*

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌ॥ ముఖ్యమంత్రి గారి ఆధ్వర్యంలో మన నూతన రాజధాని అమరావతిని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రదేశంగా తీర్చి దిద్దడానికి మరియు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. ఈ నేపధ్యంలో చేపట్టిన "వనం మనం" "హరితతాంధ్రప్రదేశ్" "నీరు-చెట్టు" తదితర కార్యక్రమాలను విజయవాడ నగర పోలీస్ శాఖ ఒక మహా యజ్ఞంలా సంకల్పించి కళాశాల, పాఠశాల విద్యార్థులు, సమాజంలో యువత, ప్రజలు మరియు వివిధ ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్ళడం జరుగుతోంది.

ఆధునిక సమాజంలో చెట్ల ఆవశ్యకత, సమాజంపై పర్యావరణ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని గౌ॥ ముఖ్య మంత్రి గారి ఆలోచనలను ఆచరణలో పెట్టి దానికి అనుగుణంగా విజయవాడ నగర పోలీస్ కమీషనరేట్ పరిధిలో పచ్చదనం, సుందరీకరణ, ఎకోఫ్రెండ్లీలో భాగంగా పర్యావరణ కాలుష్యం, అధిక ఉష్ణోగ్రతలు తగ్గించడానికి "వనం-మనం" కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. విజయవాడ నగర చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో ప్రతి ఇంటిలో మరియు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలనే దృఢ సంకల్పంతో ముఖ్యంగా విద్యార్థులు మరియు యువతను ఇందులో భాగస్వాములుగా చేయడానికి సంకల్పించడం జరిగింది. ఎందుకంటే రాబోయే భావితరాలకు వారసులు, దిశా, నిర్ధేశకులు పిల్లలే మరియు యువతే కాబట్టి. మొక్కతో పాటే ఎదిగే పిల్లలు తాము నాటిన మొక్కలు వృక్షాలుగా మారడాన్ని వారు ఆస్వాధించి, ఆనందిస్తారనే సద్దుదేశంతో ఈ కార్యక్రమాలను చేపట్టడం జరిగింది.

వనం మనం కార్యక్రమంలో భాగంగా సీడ్‌బాల్స్ వెదజల్లే ప్రదేశాలను ఇప్పటికే గుర్తించి, నవంబర్ మొదటి వారంలో గౌ॥ ముఖ్య మంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో మరియు విద్యార్థుల ద్వారా వాటిని హెలికాప్టర్‌ల ద్వారా వెదజల్లేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ క్రమంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎన్విరాన్ మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీ కొడాలి సుభాచంద్రబోస్ సహకారంతో కర్నాటక రాష్ట్రంలోని చిక్‌బళ్ళాపూర్ మరియు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుండి సేకరించిన (సిమారుబా, వేప, ఉసిరి, గానుగ, మారేడు, గంగరావి, వెలగ, కేసియో ఫిస్టులా, స్పాతోడియా, బుద్ద కోకోనట్) వివిధ రకాల వృక్ష జాతులకు సంబంధించి విత్తనాలను సేకరించి వాటిని బంకమట్టి, ఆవుపేడ, గోమూత్రం మరియు రకరకాల సేంద్రియ పదార్ధాలను కలిపిన మిశ్రమంతో సైంటిఫిక్‌గా "సీడ్ బాల్స్" తయారు చేయడం జరిగింది.

హెలికాప్టర్ చేరుకోలేని కొండ ప్రాంతాల్లో సీడ్‌బాల్స్‌ను వెదజల్లేందుకు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ట్రెక్కర్లు, పోలీస్ యంత్రాంగం, వాకర్స్ అసోషియేషన్‌లు, ఇతర ఔత్సాహికులు ముందుకు వస్తున్నందున వారందరి సహకారం తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమీషనర్ తెలియజేశారు.

విత్తనాల ప్యాకెట్‌లలో ఆరు రకాల విత్తనాలను ఉంచి విజయవాడ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని అన్ని పాఠశాలలోని విధ్యార్థులకు అందించడం జరుగుతుంది. ఈ క్రమంలో జిల్లా ప్రభుత్వ యంత్రాగాన్ని ప్రత్యేకంగా రెవెన్యూ శాఖ, విద్యా శాఖ, అటవీ శాఖ వారిని ఇందులో భాగస్వాములుగా చేయడం జరిగింది.

*(మిగతా 2వ పేజీలో ...)*

ఒక ప్రదేశంలో పెంచిన మొక్కలను మరో ప్రదేశానికి తరలించి నాటడం అనే ప్రక్రియ వ్యయ ప్రయాసలతో కూడుకున్న అంశం కాబట్టి సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియ మరియు విత్తనాలను నేరుగా సంబంధిత ప్రదేశంలో నాటడం ద్వారా వ్యయం చాలా వరకు తగ్గించవచ్చు. మరియు అధిక మొత్తంలో మొక్కలు పెంచడానికి అనుకూలంగా ఉంటుంది.

కొండ ప్రాంతాలు, గుట్టలు, అడవులు మరియు ప్రతికూలమైన ప్రదేశాల్లో సీడ్‌బాల్స్‌ను వెదజల్లేందుకు అనుకూలంగా ఉంటుంది. అలాగే మట్టి, ఇతర సేంద్రీయ పదార్థాలతో తయారు చేయడం వలన నీరు తగిలి త్వరితగతిన మొక్క రావడంతో పాటు ప్రతికూల పరిస్థితులను తట్టుకుంటుంది. ప్రస్తుతం సుమారు 1.60 లక్షల విత్తన ప్యాకెట్‌లతో పాటు 2 లక్షలు సీడ్‌బాల్స్‌ను నాటేందుకు సిద్దంగా ఉన్నాయి.

**<u>పచ్చదనం ప్రాధాన్యత :</u>**

1. మొక్కలు పెంచడం వలన నగరం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో 3-4 డిగ్రీలు ఉష్ణోగ్రత తగ్గుతుంది.
2. ప్రకృతిని ఆస్వాదించడం వలన మానసిక ఉల్లాసం, ప్రశాంతత కలుగుతుంది.
3. భూసారం పరిరక్షించబడుతుంది మరియు సకాలంలో వర్షాలు కురుస్తాయి.
4. ఒక్కో చెట్టు వలన సగటున 1500 విభిన్న జాతులకు చెందిన పక్షులు, కీటకాలు, సరీసృపాలు, పరాన్న జీవులు, పంగస్ తదితర జీవరాసులకు ఆధారం అవుతుంది.
5. ఒక చెట్టు జీవిత కాలంలో సుమారు 50 లక్షల రూపాయల విలువైన సంపదను (ఆక్సిజన్, కలప తదితరాలు) మానవుడికి అందిస్తుంది.

**<u>"వనం-మనం" కార్యక్రమంలో భాగంగా చిన్నారి విద్యార్థులతో పోలీస్ కమీషనర్ :</u>**

ఈ క్రమంలో భాగంగా మొట్టమొదటి సారిగా ది.16.10.17న మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధి ఒక విద్యాసంస్థలో విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన వివిధ జాతులకు చెందిన విత్తనాల ప్యాకింగ్ ప్రక్రియను నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు పరిశీలించి, చిన్నారి విద్యార్థులను ఆప్యాయంగా పలకరించారు.

పాఠశాలలోని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎంతో ఉత్తేజం మరియు ఉత్సాహాన్ని కనబరిచారు. ఈ సందర్భంగా కార్యక్రమం ముఖ్య ఉద్ధేశ్యం మరియు చెట్ల పరిరక్షణ, వాటి పెరుగుదలకు కావలసిన పరిస్థితులు మరియు ఉపయోగాలు, సమాజంపై పర్యావరణ కాలుష్యం ప్రభావం తదితర అంశాల గురించి విద్యార్థులు వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చుట్టు ప్రక్కల ప్రాంతం ఒక ప్రక్క కృష్ణానది నీలంతో మరో ప్రక్క మొక్కల పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడాలని విద్యార్థులు ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా విత్తన దశ నుండి మొక్క ప్రారంభ దశ, ఎదుగుదల, వాతావరణ పరిస్థితులు గురించి డెమో ద్వారా అద్యాపకులు, విద్యార్థులకు వివరిస్తుండగా నగర పోలీస్ కమీషనర్ గారు విద్యార్థులతో కలసి కూర్చుని ఆసక్తిగా తిలకించారు.

ఈ కార్యక్రమంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎన్విరాన్ మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ శ్రీ కొడాలి సుభాచంద్రబోస్ గారు విత్తనాల ప్యాకింగ్ ప్రక్రియ మరియు ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, యాజమాన్యం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

-- xx --